HICON SERIES

CLASS 4 TELUGU

తెలుగు వెలుగు CLASS 4

LESSON 5






CLICK HERE TO ACTIVATE


LESSON
PART 2

# 5 సమయస్ఫూర్తి

విజయనగర సామ్రాజ్యాన్ని శ్రీకృష్ణదేవరాయలు పరిపాలిస్తూ ఉండేవారు. ఒకసారి విజయనగర సామ్రాజ్యంపైకి పొరుగున ఉన్న రాజు అదనుచూసి, పెద్ద సైన్యంతో దండెత్తి వచ్చాడు. రాయల వారు, ఆయన సైన్యం వీరోచితంగా పోరాడి, ఆ దాడిని విజయవంతంగా అణచివేశారు. అందరూ సమర్థవంతంగా పనిచేసి, ఆ యుద్ధంలో విజయం సాధించారు. దురాక్రమణదారుల బారిన పడకుండా రాజ్యాన్ని కాపాడుకో గలిగారు. ఆ విజయానికి గుర్తుగా వేడుకలు ప్రారంభించారు రాయలవారు. ఆ వేడుకలలో భాగంగా తన రాజసభలోని సభికులందరినీ విందుకు ఆహ్వానించారు. విందు తర్వాత అందరికీ చక్కటి బహుమతులు ఇచ్చి ఘనంగా సత్కరించాలనుకున్నారు. విలువైన బహుమతులు సిద్ధంగా పెట్టారు. విందు పూర్తవుతున్న సమయంలో తెనాలి రామలింగడికి ముఖ్యమైన పని పడింది. దాని నిమిత్తం అత్యవసరంగా పొరుగు పట్టణానికి వెళ్ళాడు. రామలింగడు పని పూర్తిచేసుకొని తిరిగి సభకు వచ్చే సరికి సన్మాన కార్యక్రమం పూర్తయింది. బహుమతులన్నీ అయిపోయి ఖాళీ పళ్ళెం మాత్రమే మిగిలింది.



ఆలస్యానికి తనను తాను నిందించుకున్నాడు రామలింగడు. అప్పుడు అతనికి ఒక మెరుపు లాంటి ఆలోచన తట్టింది. బహుమతులన్నీ అయిపోగా మిగిలిన ఖాళీ పళ్ళాన్ని తీసుకొని తన మొహానికి అడ్డంగా పెట్టుకుని కూర్చున్నాడు. సభికులంతా రామలింగడిని, అతడు చేసిన పనిని గమనించారు. చివరకు రాజుగారు కూడా అతన్ని గమనించి " రామలింగా ! ఎప్పుడొచ్చావ్ ? ఎందుకలా పళ్ళాన్ని మొహానికి అడ్డుగా పెట్టుకుని కూర్చున్నావ్?" అని అడిగారు.



అందుకు రామలింగడు " రాజా! మీరు నన్ను ప్రతిసారి పళ్ళేల నిండా బంగారు నాణేలతో, రత్నాలతో, ముత్యాలతో సత్కరించడం సభికులందరూ చూసారు. ఈ రోజు ఈ విజయోత్సవ వేడుకలలో ఖాళీ పళ్ళెం బహుకరించడం సభికులు చూస్తే మీ గౌరవం ఏమవుతుంది ? అందుకే మీ గౌరవం కాపాడడానికి నేను ఇలా మొహానికి పళ్ళేన్ని అడ్డుగా పెట్టుకున్నాను " అన్నాడు.

రామలింగడి మాటలు విన్న శ్రీకృష్ణదేవరాయలు, రామలింగడికి బహుమతి అందనందుకు బాధపడ్డారు. ఆ సందర్భాన్ని చక్కగా మలుచుకున్న రామలింగడి సమయస్ఫూర్తిని గ్రహించి లోలోన సంతోషించారు రాజుగారు. "అయ్యో! రామలింగా ! నీవు మా ఆస్థాన పండితుడవు. మా రాజసభలో అత్యుత్తమ స్థానాన్ని వరించదగిన వాడవు. నీలాంటి పండితోత్తముడిని ఖాళీ చేతులతో ఇంటికి పంపడమా ! లేదు, లేదు" అంటూ మహారాజు తన మెడలోని ముత్యాల హారాన్ని తీసి రామలింగడి వద్ద ఉన్న పళ్ళెంలో పెట్టారు. తన ఉపాయం ఫలించినందుకు రామలింగడు సంతోషించి, రాజుకు అభివందనం చేస్తూ సభనుండి సెలవు తీసుకున్నాడు.

"ఆలస్యంగా వచ్చినా రామలింగడు తన తెలివితో మంచి బహుమతిని ఎగరేసుకు పోయాడు" అని సభికులందరూ అనుకున్నారు. చూశారా ! రామలింగడు ఉపాయంతో ఎవరినీ నొప్పించకుండా అందరికంటే విలువైన బహుమతిని ఎలా సాధించుకున్నాడో !

H4TR

# అభ్యాసం

## I. అర్థాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| పొరుగున | = | ప్రక్కన | ఘనంగా | = | గొప్పగా |
| అదను చూసి | = | సరియైన సమయం చూసుకొని | సత్కరించు | = | గౌరవించు |
| | | | నిమిత్తం | = | కారణం |
| దండెత్తు | = | యుద్ధానికి వచ్చు | నిందించు | = | తిట్టు |
| అణచి వేయుట | = | ఎదురుదాడి చేసి గెలుచుట | గమనించు | = | గుర్తించు |
| విజయం | = | గెలుపు | సమయస్ఫూర్తి | = | సమయమునకు తగిన ఆలోచన స్ఫురించుట |
| వేడుక | = | పండుగ | | | |
| సభికులు | = | సభలోని సభ్యులు | ఉపాయం | = | కార్యసాధనకు అనుసరించే మార్గం |
| విందు | = | ఆతిథ్యము | | | |

## II. పదజాలం

**(అ) ఈ క్రింది వాటికి వ్యతిరేక పదాలు రాయండి.**

1. విజయం × ______________
2. సమర్థత × ______________
3. అవసరం × ______________
4. గౌరవం × ______________
5. ఉత్తముడు × ______________
6. సంతోషం × ______________

**(ఆ) ఇతర వచనాలు రాయండి.**

1. పండితుడు – ______________
2. వేడుక – ______________
3. కార్యక్రమం – ______________
4. సభికులు – ______________
5. పట్టణాలు – ______________
6. పళ్ళెం – ______________

**(ఇ) క్రింది వాక్యాల్లో తప్పు ( × ), ఒప్పు (✓) లను గుర్తించండి.**

1. తెనాలి రామలింగడికి రాజుగారు బహుమతి ఇవ్వలేదు. ( )
2. విజయనగర సామ్రాజ్యాన్ని పొరుగురాజు ఆక్రమించాడు. ( )
3. శ్రీకృష్ణదేవరాయలు సభికులను ఘనంగా సత్కరించారు. ( )
4. రామలింగడి ఉపాయం ఫలించింది. ( )

**(ఈ) క్రింది పదాలు ఉపయోగించి సొంత వాక్యాలు రాయండి.**

1. ఉపాయం : ______________________
2. దండెత్తు : ______________________
3. వేడుకలు : ______________________
4. ఖాళీ చేతులు : ______________________
5. సమయస్ఫూర్తి : ______________________
6. ఎగరేసుకు పోవు : ______________________

**(ఉ) క్రింది ఖాళీలను పూరించండి.**

1. విజయనగర సామ్రాజ్యాన్ని ______________ పరిపాలిస్తూ ఉండేవారు.
2. సభికులంతా ______________ చేసిన పనిని గమనించినారు.
3. రామలింగడు ______________ సామ్రాజ్య ఆస్థాన పండితుడు .
4. విందు పూర్తవుతున్న సమయంలో ______________కి ముఖ్యమైన పని పడింది.

## III. ప్రశ్నావళి

**(అ) ఈ క్రింది ప్రశ్నలకు ఒకటి లేక రెండు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. విజయనగర సామ్రాజ్యాన్ని ఎవరు పరిపాలిస్తూ ఉండేవారు ?
2. బహుమతులు ఎప్పుడు ఇద్దామనుకున్నారు ?
3. రామలింగడికి బహుమతి ఎందుకు అందలేదు ?
4. “ సమయస్ఫూర్తి” పాఠంలో సమయస్ఫూర్తిని ప్రదర్శించింది ఎవరు ?

**(ఆ) ఈ క్రింది ప్రశ్నలకు ఐదు లేక ఆరు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. రామలింగడు తనను తాను ఎందుకు నిందించుకున్నాడు ?
2. సమయస్ఫూర్తి అంటే ఏమిటి ? రామలింగడి సమయస్ఫూర్తిని వివరించండి.

## IV. వ్యాకరణం

**ఈ క్రింది  వాక్యాలను పరిశీలించండి.**

1. ఆవుపాలు తెల్లగా, చిక్కగా ఉన్నాయి.
2. వాళ్ళ ఇంట్లో వస్తువులన్నీ అందంగా ఉంటాయి .
3. కొత్త గుఱ్ఱం పరిగెత్తుతున్నది.
4. బాలు మధురమైన పాట పాడుతున్నాడు.
5. ఎవరెస్టు ఎత్తైన శిఖరం.

పై వాక్యాలలోని తెల్లగా, చిక్కగా, అందంగా, కొత్త, మధురమైన, ఎత్తైన అనే మాటలు గుణాన్ని తెలుపుతున్నాయి. నామవాచక, సర్వనామాల యొక్క గుణాలను తెలిపే మాటలను **విశేషణాలు** అంటారు.

## V. ప్రాజెక్టు పని



తెనాలి రామలింగనికి సంబంధించిన ఒక కథను సేకరించి, చార్టుపై రాసి ప్రదర్శించండి.